సాక్షి ప్రకాశం

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



లక్ష్యం బారెడు.. వసూళ్లు మూరెడు

జిల్లాలో పన్నుల వసూలు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇంకా రూ.28.66 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉంది. - 8లో..



పి-4 సర్వేను వేగవంతం చేయండి

జిల్లాలో పి-4 సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చిన్నకంభంలో జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు

కంభం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ జాతీయ స్థాయి ఒంగోలుజాతి ఎడ్లపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరో బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఎడ్ల యజమానులు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7032279269 నంబరును సంప్రదించాలని కోరారు.

అప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ సీఎంకు ఉత్తరాలు



అప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ పోస్టుకార్డులు పోస్ట్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్: ఆప్కాస్ ను రద్దుచేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టు కార్డులను పోస్టు చేసినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి కోర్నేపాటి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పోస్టు కార్డు పోస్టు చేసే సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆప్కాస్ వల్ల గత నాలుగేళ్ల నుంచి మున్సిపల్ కార్మికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీతాలు తీసుకున్నారని చెప్పారు. మధ్య దళారులు లేకుండా, జీతాల్లో కోతలు లేకుండా పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికుల అకౌంట్లో పడ్డాయని చెప్పారు. ఇప్పుడు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే జీతాలు సక్రమంగా అందవని, ఈపీఎఫ్ చెల్లించరని ఆందోళన వ్యక్తం చేశారు. మేము అధికారం లోకి వస్తే మెరుగైన వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు నరకం చూపిస్తోందని మండిపడ్డారు. కరోనా సమయంలో తమ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కార్మికులకు అన్యాయం చేయడం తగదని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర ముసుగులో కార్మికుల బతుకులను వీధిపాలు చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సామ్రాజ్యం, యు.కుమారి, మోహన్ రావు, విజయమ్మ, భారతి, ఆమని, అనిత, బి.అరుణ, దివ్య, కోటేశ్వరరావు, వై.రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఈ నెల 28వ తేదీలోపు ఐటీఐ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మార్చి 3 నుంచి మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. పదో తరగతి, ఆ పైన పాస్ అయిన వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఇతర పూర్తి వివరాలకు 7842004344 అనే నంబరును సంప్రదించాలన్నారు.

వైద్య పరికరాలపై అవగాహన అవసరం



వైద్య పరికరాలపై అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: అధునాతన వైద్య పరికరాల పనితీరుపై అవగాహన పెంచుకోవడం ద్వారా రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున చెప్పారు. సైరిక్స్ ఆధ్వర్యంలో ఎమర్జన్సీ ఎక్విప్‌మెంట్ మేనేజ్‌మెంట్ పై సోమవారం జీజీహెచ్ లో నిర్వహించిన వర్క్ షాప్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైద్య పరికరాల పనితీరు, నిర్వహణను సిబ్బంది తెలుసుకోవాలన్నారు. సైరిక్స్ సంస్థ డివిజన్ మేనేజర్ హేమంత్ మాట్లాడుతూ అత్యవసర వైద్య పరికరాలు వినియోగించడానికి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ విభాగ ఇంజినీర్ సురేష్, జిల్లా ఇన్‌చార్జి సురేష్ బాబు, జాషువా రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. బయో మెడికల్ టెక్నీషియన్స్ సౌజన్య, శరత్ పాల్గొన్నారు.

ఆ శని పాతం!



శనగరైతు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాడు. దిగజారుతున్న ధరలు, దిగుబడులతో లబోదిబోమంటున్నాడు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవు..మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు కేంద్రం శనగల దిగుబడులపై సుంకాన్ని ఎత్తివేసి నిలువునా ముంచేసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు రైతులు. మార్కెట్లో ధరలు లేక బిక్కుబిక్కుమంటున్న రైతులు సరుకును కోల్డ్‌స్టోరేజీల్లో ఉంచేస్తున్నారు.

- ధర లేక అల్లాడుతున్న శనగ రైతులు
- దీనికి తోడు దిగుమతి సుంకాన్ని ఎత్తేసిన కేంద్రం
- దేశీయ శనగ దిగుబడిపై తీవ్ర ప్రభావం
- గతేడాది తెల్ల శనగలు క్వింటా రూ.10,500
- ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయిన వైనం
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతున్న గత ఏడాది శనగ నిల్వలు
- ఈ సీజన్‌లో జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో శనగ సాగు లక్ష్యం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో శనగ పంట సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఆలస్యంగా శనగ పంట సాగు చేశారు. పశ్చిమ ప్రాంతంలో ముందుగా సాగు చేశారు. అందులో భాగంగా ఇప్పటి వరకు లక్షకు పైగా ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పశ్చిమ ప్రాంతంలోని గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో కోతలు ఇప్పటికే ప్రారంభించారు. తొలినాళ్లలో క్వింటా శనగలు ధర రూ.7 వేలు పలికింది. అక్కడ నుంచి క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం ఆ ధర కాస్తా రూ.5 వేలకు పడిపోయింది. దీంతో శనగ రైతులు ఆందోళనలో పడిపోయారు.

దిగుమతి సుంకం ఎత్తేసిన కేంద్రం

జిల్లాలో రెండు రకాల శనగలు పండిస్తారు. ఒకటి కాగ్ రకం (తెల్లవి) కాగా, రెండోది జేజే రకం. ఈ రెండు రకాలు దేశీయంగా వాడుకలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా పండే ఈ రెండు రకాల శనగలకు మంచి గిరాకీ ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి వచ్చే శనగ ఉత్పత్తులకు దిగుబడి సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. దీంతో దేశీయంగా పండే శనగ ఉత్పత్తులకు కాలం చెల్లి చెల్లినట్లయింది. గత ఏడాది వరకు ఇతర దేశాల నుంచి దిగుబడి అయ్యే శనగ దిగుబడులపై 28 శాతం దిగుబడి సుంకాన్ని విధిస్తూ వచ్చింది. అయితే కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఆ దిగుబడి సుంకాన్ని పూర్తిగా ఎత్తేయడంతో దేశీయ శనగ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. దేశీయంగా పండే కాగ్-2 రకం, జేజే రకం శనగ ఉత్పత్తులకు గిరాకీ కొంత అటు ఇటుగా ఉంటూ వచ్చింది. ప్రస్తుతం శనగ దిగుబడులపై దిగుమతి సుంకం లేకపోవటంతో విదేశాల నుంచి ఇబ్బడిముబ్బడిగా శనగ దిగుమతులు జాతీయ మార్కెట్‌లో వచ్చి పడుతున్నాయి. ఆ ప్రభావం స్థానిక మార్కెట్‌లపై పడటంతో ధర పూర్తిగా పతనమైంది.

ప్రభుత్వ ప్రోత్సాహం ఏదీ..?

శనగ పంటను పండించే రైతులకు ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేస్తున్న రైతుకు కనీసం ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతుకు పెట్టుబడి సాయం లేకపోవడంతో పాటు ఎలాంటి సబ్సిడీలు కూడా అందకపోవటంతో రైతు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయాడు. విదేశాల్లో రైతులకు ఆయా ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోవటం వల్లనే అతి తక్కువ ధరకు అంతర్జాతీయ మార్కెట్‌లో అక్కడి రైతులు అమ్ముకోగలుగుతున్నారు. ఆ ప్రభావం దేశీయ శనగ రైతుపై పడి విలవిల్లాడుతున్నాడు. దీంతో శనగలను కోల్డ్ స్టోరేజీల్లో ఉంచేస్తున్నారు. ఇప్పటికే గత ఏడాది సరుకు కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతుండడం గమనార్హం.

గత ఏడాది మంచి ధరలు

గత ఏడాది 75 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. దాదాపు ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. దీంతో జిల్లాలో 5.50 లక్షల నుంచి 6 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అప్పట్లో క్వింటా రూ.10,200 నుంచి రూ.10,500 వరకు అమ్ముడు పోయింది. దీంతో రైతులు కొంతమేర లాభ పడ్డారు. ప్రభుత్వం ఏ విధంగానూ ఆదుకోకపోయినా ఓపెన్ మార్కెట్‌లో మంచి ధర పలకటంతో రైతులకు ఇబ్బంది లేకుండా పోయింది.

> **శనగ అంటేనే భయంగా ఉంది**
>
> 
>
> ఈ ఏడాది తీవ్రమైన వర్షాలతో పంట కాలం కొంత ఆలస్యమైనా గత ఏడాది ఉన్న మార్కెట్ ఆశతో 10 ఎకరాల్లో శనగ సాగు చేశాను. గత ఏడాది కాక్-2 రకం క్వింటా రూ.10 వేలు ఉంటే ఈ ఏడాది రూ.5 వేలు మాత్రమే ఉంది. జేజే శనగలకు ప్రస్తుతం రూ.5 వేల కంటే ఎక్కువ అడిగే పరిస్థితి లేదు. పోయిన ఏడాది ఇదే సమయంలో జేజేలను రూ.6700లకు అమ్ముకున్నా. పంట దిగుబడి కూడా అంత ఆశాజనకంగా లేదు. శనగ అంటేనే భయంగా ఉంది.
>
> – వెంకటేశ్వర్లు, శనగ రైతు, ఈదుమూడి

నష్టం మిగిలింది



గిద్దలూరు మండలం నరవ గ్రామానికి చెందిన పాండు రంగారెడ్డి శనగ రైతు. మొత్తం ఐదు ఎకరాల్లో శనగ సాగుచేశాడు. ఎకరాకి రూ.45 వేలు ఖర్చు చేశాడు. మొత్తం రూ.2.25 లక్షల వ్యయంతో సాగు చేస్తే ప్రస్తుతం దిగుబడి తగ్గింది. ధరలు పడిపోవడంతో దిక్కు తోచని స్థితిలో పడిపోయాడు. గతంలో ఎకరాకు 10, 11 టిక్కీల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 5, 6 టిక్కీలు మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది. పంట సాగుచేసే సమయంలో క్వింటా ధర రూ.9,600. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. ఒకవైపు దిగుబడి తగ్గి మరో వైపు ధరలు పతనమవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని పరిస్థితి. గతంలో ఇచ్చిన సబ్సిడీ 40 శాతాన్ని ఈ ప్రభుత్వం 25 శాతానికి తగ్గించేసింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ వాపోతున్నాడు. పంట నష్ట పరిహారం కింద రూ.350 ప్రకారం బీమా కట్టించుకున్నారు. గత ప్రభుత్వంలో ఇన్సూరెన్స్ ఉచితంగా ఉండి రైతులకు ఊరటగా ఉండేది.

రైతుకు బాసటగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి వరకు శనగ రైతులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఆదుకుంది. అప్పటి వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం శనగ రైతుకు ఎలాంటి ప్రోత్సాహం అందించకపోవడంతో మార్కెట్లో ధర లేక దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు శనగలు కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతూ వచ్చాయి. శనగ రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని గమనించి శనగ రైతుకు ప్రోత్సాహాన్ని అందించింది. ఒక్కో క్వింటాకు ప్రభుత్వం రూ.1,500 నేరుగా ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. అప్పట్లో జిల్లాలోని 27 వేల మంది రైతులకు ఒక్కో రైతుకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించటంతో శనగ రైతులు అప్పుల నుంచి బయట పడ్డారు. దాదాపు జిల్లాలోని కేవలం శనగ రైతులకు రూ.108 కోట్లు నేరుగా అందజేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వీరిని పట్టించుకున్న దాఖలాల్లేవు.

> **నష్టాలు తప్పేలా లేవు**
>
> 
>
> పెరిగిన ఖర్చులతో పంటలు పండించాలంటేనే భయంగా ఉంటుంది. పంట చేతికొచ్చే సమయానికి దళారులు ధరలను దిగ్గోస్తున్నారు. శనగ రైతుల మేలు కోరి ఇదే సమయానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదనంగా రూ.1500 మద్దతు ధర ఇచ్చింది. దీని వల్ల శనగ రైతులకు చాలా ప్రయోజనకరంగా మారింది. ప్రస్తుతం పంటలు అమ్ముకోవాలంటే తీవ్రమైన నష్టాలను చూడాల్సి వస్తోంది.
>
> – అలవల చెంచారెడ్డి, రైతు

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో గ్రీవెన్సు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్అన్సారియా మాట్లాడుతూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేస్తారని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తారన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ, రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. యూకలిప్టస్ చెట్లపై కొత్త వైరస్ వ్యాపించిందని, రైతులపై ప్రభావం గురించి తక్షణ విచారణ అవసరమని కరవది గ్రామానికి చెందిన రైతులు మన్నే శ్రీనివాసరావు కలెక్టర్ తమీమ్ అన్సారియా అర్జీ సమర్పించారు. ఈ వైరస్ మూల కారణాన్ని అన్ని కోణాల నుంచి సమగ్రంగా విచారించాలని కోరారు. ఐటీసీ పీఎస్‌పీడీ సోకిన మొక్కలను పంపిణీ చేసినందుకు బాధ్యత వహించమని, రైతులకు కలిగిన నష్టాలకు పరిష్కారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, పార్థసారధి జాన్సన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలస్యంగా త్రిపురాంతకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- 12 గంటలు ఆలస్యంగా ప్రారంభించిన వైనం
- ఈఓ అందుబాటులో లేకపోవడంతో జాప్యం
- సాంప్రదాయ దుస్తులను విస్మరించిన ఆలయ ఈవో రజనీకుమారి
- ఈవో తీరుపై మండిపడుతున్న భక్తులు



ఆలస్యంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న దంపతులు, ఈవో రజనీకుమారి

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్వికరణం, పంచగవ్యప్రాశనలతో ప్రారంభం కావాల్సిన బ్రహ్మోత్సవాలు రాత్రి 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ జరగాల్సి ఉంది. మహాశివరాత్రి పండుగకు రెండు రోజుల ముందు స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తులు ఉదయం నుంచి వేచి ఉండి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అక్కడికి చేరి త్రిపురాంతకేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరి ఆలయాల్లో జరిగే విశేష అర్చనలు, రుద్రహోమం, బలిహరణలు, మధ్యాహ్నం జరిగే విశేష పూజలు, ప్రదోషకాల పూజ, రాత్రి 7గంటలకు రుద్ర హోమం, బలిహరణలు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే ఆలయ కార్యనిర్వహణాధికారిణి డి.రజనీ కుమారి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలోకి రాలేదు. అప్పటి వరకు వేచి ఉన్న ఆలయాల కమిటీ సభ్యులు, సిబ్బంది ఆమెకు ఫోన్ చేసినా స్పందించలేదు. చివరకు ఆమె ఆలస్యంగా రావడంతో బ్రహ్మోత్సవాలు కూడా 12 గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో కార్యనిర్వహణాధికారిణి సాంప్రదాయ దుస్తులతో పాల్గొనాల్సి ఉంది. అయితే ఆమె పంజాబి డ్రస్ ధరించి, తలపై కళ్లద్దాలు పెట్టుకొని దర్శనం ఇవ్వడంతో భక్తులు అవాక్కయ్యారు. ఆమె తీరుపై భక్తులు మండిపడుతున్నారు.

కూల్చివేతలకు నిరసనగా రాస్తారోకో



రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి నిరసన తెలుపుతున్న స్థానికులు

- రోడ్డుపై రాళ్లు అడ్డంగా పెట్టడంతో రాక పోకలకు అంతరాయం
- 100 అడుగుల రోడ్డు పేరుతో భవనాల కూల్చివేతను అడ్డుకున్న స్థానికులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు-కొప్పోలు రోడ్డులో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు అడ్డగోలుగా చేస్తున్న కూల్చివేతలను స్థానికులు అడ్డుకున్నారు. స్థానిక రైల్వే ఫ్లైఓవర్‌కు తూర్పు వైపున సోమవారం నగర పాలక సంస్థ అధికారులు రోడ్డు పక్కన ఉన్న భవనాలను కూల్చివేయటం ప్రారంభించారు. స్థానిక ఎఫ్‌సీఐకి ఎదురుగా ఉన్న ఇందిరా కాలనీ ప్రజలు అందుకు వ్యతిరేకించి కూల్చివేతలను అడ్డుకున్నారు. రోడ్డుపై రాళ్లు పెట్టిమరీ నిరసనకు దిగారు. దాంతో ఒంగోలు-కొత్తపట్నం రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 100 అడుగుల రోడ్డు పేరుతో సంబంధం లేని భవనాలను కూడా కూలుస్తున్నారంటూ నినాదాలు చేశారు. దాంతో నగర పాలక సంస్థ అధికారులు పోలీసులను రంగంలోకి దించారు. ఒంగోలు తాలూకా పోలీసులు స్థానికులను అక్కడ నుంచి తొలగించారు. లోకాయుక్తలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు తొలిగించాలని ఆదేశించటం వల్లనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని నగర పాలక సంస్థ అధికారులు స్థానికులకు చెప్పి ఆందోళనను విరమింపజేశారు. అయితే ఓ టీడీపీ నాయకుడు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి నిర్మించిన ఇంటి జోలికి వెళ్లకుండా నామమాత్రంగా తొలగించి దానికి ఇరువైపులా ఉన్న వేరే వారి భవనాలు కూల్చేశారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



టీడీపీ నాయకుడు రోడ్డు మార్జిన్ ఆక్రమించి నిర్మించిన ఇల్లు

ఫార్మర్ విశిష్ట నంబర్ల కోసం ప్రత్యేక క్యాంపులు

- జేడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

దొనకొండ: జిల్లా వ్యాప్తంగా ఫార్మర్ ఐడీల కోసం క్యాంపులు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఆరవెల్లిపాడు గ్రామ రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాంపును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పొలం ఉన్న ప్రతి రైతుకు విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. నమోదు సమయంలో ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు వస్తాయన్నారు. వాటిని గ్రామ వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకి లింక్ అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకులను కలవాలన్నారు. రైతులు రెండు కన్నా ఎక్కువ రెవెన్యూ గ్రామాల్లో పొలం ఉంటే ఎక్కడో ఒక చోట ఫార్మర్ ఐడీ చేయించుకుంటే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయాధికారి శ్రీనివాస నాయక్, ఏడీఏ బాలాజినాయక్, మండల వ్యవసాయాధికారి ఎన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతుల ఊసు పట్టని చంద్రబాబు



మాట్లాడుతున్న కిసాన్ మహాసభ నాయకులు

- అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని, రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య విమర్శించారు. స్థానిక మల్లయ్యలింగం భవన్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు మద్దతు ధర ఇచ్చే విషయంలో కేరళ అగ్రస్థానంలో ఉండగా ఆ తరువాత స్థానంలో పంజాబ్ నిలిచిందని తెలిపారు. ఎన్నికలకు ముందు రైతు భరోసా ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు కూటమి ప్రభుత్వం మద్దతు పలకడం దుర్మార్గం అన్నారు. కేంద్ర మద్దతు ధరలకు అదనంగా పొరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం బోనస్ ప్రకటించకుండా రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 5 నుంచి 10 వ తేదీ వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటుగా మన రాష్ట్రంలోనూ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో మద్దతు ధరపై తీర్మానం చేసేలా రాష్ట్రం మీద ఒత్తిడి తెస్తామన్నారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేవలం రూ.171 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది బడ్జెట్లో మూడు శాతమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని క్వింటాలు మిర్చి మద్దతు ధర రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లు కేటాయించాలని కోరారు. ఏప్రిల్ లో అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు తమిళనాడులోని నాగపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించి నిర్వాసితులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.వీరా రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశం లో రైతు సంఘం నాయకులు ఉప్పుటూరి ప్రకాశ రావు, కరవది సుబ్బారావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- పట్టణాల్లో మందకొడిగా ఆస్తి పన్ను వసూలు
- జిల్లాలో 1,25,065 అసెస్‌మెంట్లకు రూ.65.69 కోట్ల పన్ను
- ఇప్పటి వరకు వసూలైంది రూ.37.03 కోట్లు
- మార్చి నెలాఖరు నాటికి లక్ష్యం నెరవేరేనా?
- పన్ను చెల్లింపులో ముందున్న చీమకుర్తి, అట్టడుగున పొదిలి

లక్ష్యం బారెడు.. వసూళ్లు మూరెడు!

మార్కాపురం టౌన్:

జిల్లాలో పన్నుల వసూలు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఒంగోలు నగరంతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పన్ను గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణాల్లో అభివృద్ధి పనులు, ఉద్యోగుల వేతనానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. పుర ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా పన్ను వసూళ్ల లక్ష్యం సగమే పూర్తయింది. జిల్లాలో ఒక కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాల్టీలు/నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 24వ తేదీ నాటికి ఆస్తి పన్నును ప్రజలు అంతంత మాత్రమే చెల్లించారు. మార్చి నెలాఖరు నాటికి పన్నుల రూపంలో 95 శాతం ప్రజలు చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పన్ను బకాయిలు అధిక మొత్తంలో ఉన్న వారి ఇళ్ల వద్దకు మున్సిపల్ సిబ్బందిని పంపుతున్నా ఆశించిన ఫలితం కానరావడం లేదు. పన్నులు చెల్లించాలని వార్డు సచివాలయాల సిబ్బంది మొత్తం తమ పరిధిలోని నివాసాలకు వెళ్లి చేస్తున్న విజ్ఞప్తులనూ కొందరు లైట్‌గా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది పన్ను బకాయిలు చెల్లించాలని మైక్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాల్లో ఇటీవల ప్రచారం చేయగా కొంత మేర బకాయిలు వసూలైనట్లు మున్సిపల్ రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

చీమకుర్తి టాప్..

జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు మార్కాపురం మున్సిపాలిటీ, ఐదు నగర పంచాయతీల్లో మొత్తం 1,25,065 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ 65.69 కోట్లు కాగా సోమవారానికి రూ.37.03 కోట్లను ప్రజలు చెల్లించారు. మరో 28.66 కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది. పన్ను చెల్లింపులో ఫిబ్రవరి 24వ తేదీ నాటికి చీమకుర్తి నగర పంచాయతీ 77.61 శాతం వసూళ్లతో ముందుండగా, 39.08 శాతంతో పొదిలి నగర పంచాయితీ అట్టడుగు స్థానంలో ఉంది. కనిగిరి నగర పంచాయతీ 61.64 శాతం వసూళ్లతో రెండో స్థానంలో, మార్కాపురం మున్సిపాలిటీ 57.11 శాతం వసూళ్లతో మూడవ స్థానంలో నిలిచాయి.



మార్కాపురం పట్టణ వ్యూ

పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలు



పురపాలక సంఘంలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం. రోజువారీగా విధులు నిర్వహిస్తూనే అనుకూల సమయంలో బకాయిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించి పన్ను చెల్లించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరుతున్నాం.

– నారాయణరావు, కమీషనర్, మార్కాపురం మున్సిపాల్టీ



స్కూటర్‌కు మంటలు



దగ్ధమవుతున్న స్కూటర్

మార్కాపురం: పార్కింగ్ చేసిన స్కూటర్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి కాలిపోయిన సంఘటన సోమవారం మార్కాపురం పట్టణంలో చోటుచేసుకుంది. తర్లుపాడుకు చెందిన ఓ వ్యక్తి తన స్కూటర్‌ను మార్కాపురం పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్దగల ఆంజనేయ స్వామి గుడి పక్కన దుకాణం ముందు పార్కింగ్ చేశాడు. మధ్యాహ్నం సమయంలో స్కూటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. సమీపంలో ఉన్న వారు స్పందించి మంటలు అదుపుచేశారు. ప్రమాదానికి కారణం షార్టు సర్క్యూటా.. ఎండ వేడి వల్లా అనేది తేలాల్సి ఉంది.

పి-4 సర్వేను వేగవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: పి-4 సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో సోమవారం అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీన పెన్షన్ ల పంపిణీ, రెండో తేదీ ఆదివారం అయినందున ఈ సర్వేను ఈ వారంలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది మరింత చురుకుగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే పెన్షన్‌ల పంపిణీ సమయంలో నగదు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. లబ్ధిదారులతో నిర్లక్ష్యంగా ప్రవర్తించినా సహించబోనని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే మార్చి 15 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్స్ తవ్వకాలపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ అన్నారు. లేబర్ మొబిలైజేషన్ పైనా, సగటు వేతనం పెంపు పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ఇంకుడు గుంతలు కూడా త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని చెప్పారు. గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో స్పష్టమైన పురోగతి ఉండాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, తాగునీటి క్లోరినేషన్ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో చిన ఓబులేసు, డీపీఓ వెంకట నాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ జోసఫ్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, సీపీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఇంటర్ పరీక్షలకు సర్వం సన్నద్ధం

- ఇప్పటికే ఏర్పాట్లు చేసిన అధికారులు
- జిల్లాలో ఐదు సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు

ఒంగోలు సిటీ: విద్యార్థి జీవితంలో రెండో మెట్టయిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు సమయం ముంచుకొస్తోంది. జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పరీక్షలకు 42,439 మంది విద్యార్థులు

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనుండగా 21,624 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సెకండియర్ విద్యార్థులు 20,815 మంది పరీక్షకు హాజరవనున్నారు. వారం రోజుల క్రితం సీనియర్ ఇంటర్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పూర్తయిన విషయం తెలిసిందే.

67 కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలో జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ సూపరింటెండెంట్లు 67 మంది, డిపార్ట్‌మెంటల్ అధికారులు 67 మందిని నియమించారు. కస్టోడియన్లుగా 27 మంది, అదనపు చీఫ్ సూపరింటెండెంట్ (ప్రైవేట్ కాలేజీలు) 40 మందిని నియమించారు. 3 సిట్టింగ్ స్క్వాడ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఇద్దరు పరిశీలకులను అధికారులు నియమించారు.

సమస్యలపై హెల్ప్ లైన్

విద్యార్థులు, అధికారులకు పరీక్షల సమయంలో ఏవైనా అనుమానాలు వస్తే నివృత్తి చేసుకోవడానికి ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్ 08592 281275ను ఏర్పాటు చేశారు.

5 సమస్యాత్మకం.. 4 దుర్బలం

జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూత వేయడంతోపాటు ఇతరులు ఉండగా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఐదు సున్నితమైన, సమస్యాత్మక కేంద్రాలను కూడా గుర్తించారు. వాటిలో దోర్నాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ, యర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కంభం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, అర్ధవీడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, గిద్దలూరులోని సాహితీ జూనియర్ కాలేజీని సమస్యాత్మకమైనవిగా అధికారులు పేర్కొన్నారు. కాగా తురిమెళ్ల గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, ఉప్పుగుండూరు జూనియర్ కాలేజీ, గిద్దలూరు సాహితీ జూనియర్ కాలేజీ, ఒంగోలు చైతన్య జూనియర్ కళాశాలను దుర్బలమైన కేంద్రాలుగా గుర్తించారు.



ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ కార్యాలయం

పోలీస్ గ్రీవెన్స్‌కు 63 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పాండురంగారావు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 63 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు పోలీసు అధికారులను కలిసి తమ సమస్యలపై రాత పూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు బాధితులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేందుకు కషి చేస్తామని చెప్పారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తాలూకా సీఐ అజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి

యర్రగొండపాలెం: మద్యం మత్తులో తమ్ముడిపై అన్న ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని గంగుపల్లెలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు జి.రామాంజి, లక్ష్మణుడు అన్నాదమ్ముళ్లు. రామాంజి మద్యానికి బానిసై ఇంట్లో గొడవపడుతుంటేవాడు. వారిద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తమ్ముడు లక్ష్మణుడు గాఢ నిద్రలో ఉన్న సమయంలో వేకువ జామున అన్న ఇనుప రాడ్డుతో తలపై కొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గమనించి గాయపడిన లక్ష్మణుడుని ముందుగా పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మార్కాపురంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. లక్ష్మణుడి తల్లి పిచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

కళ్లంలో మిర్చి దగ్ధం



సంఘటనా స్థలంలో కాలుతున్న మిర్చి

పెద్దదోర్నాల: కళ్లంలో ఆరబెట్టిన మిర్చి అగ్నికి ఆహుతైన ఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని గంటవానిపల్లెలోని సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పాత్లావత్ చిన్న నాగేనాయక్ తన 2 ఎకరాల వ్యవసాయ భూమిలో మిర్చి పంట సాగు చేశారు. రెండో కోతలో వచ్చిన మిర్చి దిగుబడిని పొలం పక్కనే కళ్లంలో ఆరబెట్టారు. అయితే సోమవారం మధ్యాహ్నం మిర్చి మంటల్లో కాలిపోవడాన్ని సమీప రైతులు గుర్తించి నాగేనాయక్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పెట్రోలింగ్ పోలీసులు వచ్చి వ్యవసాయ బోర్ల నీటితో మంటలు అదుపు చేశారు. ఈ ఘటనపై రైతు నాగేనాయక్ అనుమానం వ్యక్తం చేశారు. చేతికొచ్చిన 20 క్వింటాళ్ల మిర్చి అగ్నికి ఆహుతవడంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నాడు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలకు సంకెళ్లు

- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- 88 కేజీల రాగితీగ, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దర్శి డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి(కురిచేడు): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు ఆరుగురిని అరెస్టు చేసినట్లు దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్సైలు మురళి, నాగరాజు, మల్లికార్జునరావుతో కూడిన ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో పొదిలికి చెందిన దేవరకొండ శేషారావు, ఇట్లా శ్రీకాంత్, పేర్నమిట్టకు చెందిన పొన్నర్సు వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన ఇట్టా దుర్గాప్రసాద్, మీర్జాపేటకు చెందిన గరికపాటి ఆంజనేయులు, నాలి అల్లూరయ్య బృందం చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి కదలికలపై నిఘా ఉంచి సోమవారం ఉదయం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 88 కిలోల రాగితీగ, నేరాలకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితులపై ముండ్లమూరు, బల్లికురవ, అద్దంకి, తర్లుపాడు, తాళ్లూరు, దర్శి, కొనకనమిట్ల, పెద్దారవీడు, కొరిశపాడు పోలీసుస్టేషన్ల పరిధిలో 72 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు సంబంధించి 23 కేసులు ఉన్నాయని చెప్పారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చాటిన పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకం పేరుతో మోసం

- అజ్ఞాత వ్యక్తి చేతిలో రూ.68 వేలు పోగొట్టుకున్న యువకుడు

పెద్దదోర్నాల: జీఎస్టీ కింద కొంత నగదు చెల్లిస్తే ప్రభుత్వం నుంచి మంజూరైన రుణాన్ని మీ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామని ఓ అజ్ఞాత వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి పెద్దదోర్నాలకు చెందిన యువకుడు మోసపోయాడు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. ఈ నెల 15వ తేదీన దోర్నాలకు చెందిన ఓ యువకుడికి 86098 93880 నుంచి ఫోన్ కాల్ వచ్చింది. నీకు ప్రభుత్వం నుంచి రుణం మంజూరైందని, జీఎస్టీ డబ్బు కొంత చెల్లిస్తే నగదు జమవుతుందని నమ్మబలికాడు. వారం వ్యవధిలో రూ.68 వేల రూపాయలు గుంజాడు. రుణం ఇంకా రాలేదేంటి అని బాధిత యువకుడు ప్రశ్నించగా మరికొంత చెల్లించాలని చెప్పుకొచ్చాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ఆ యువకుడు పోలీసులకు, సైబర్ సెల్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. తనను మోసం చేసిన వ్యక్తి ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరిస్తున్నాడని బాధిత యువకుడు వాపోయాడు.